# మొగుడే మూడో సన్యాసి!

మంగళాంబిక మహిళా మండలి మీటింగ్ వెళ్ళాన్న తొందరలో ఉంది. మల్లెపూలమాల తెమ్మని ఒక పనివాడికి పురమాయించింది! వాడు సమయానికి రాలేదన్న అసహనంతో పోర్టికోలో నిలబడింది. పోర్టికోలోని కారు దుమ్ము దుమ్ముగా వుంది; అసహ్యంగా కనపడింది. రెండో సేవకుడ్ని తిట్టడం లంకించుకుంది. ఆఖరికి అసహనంతో కృంగిపోయి "యింట్లో ముగ్గురు మగ సన్యాసులున్నారు! ఇంట్లోంచి ముఖ్యమైన పనిమీద బయటికి వెళ్ళాలంటే అన్నీ అడ్డంకులే! ఒక్కపనీ తిన్న గాచెయ్యరు" అంటూ మొత్తంమీద మీటింగ్‌కి ఉడాయించింది.

ఆవిడ బయటికి వెళ్ళిన తరువాత, ఆ ఇద్దరు పనివాళ్ళు "వున్నది మనమిద్దరమే కదా పనివాళ్ళం, అమ్మగారు ముగ్గురు సన్యాసులు అని కేకలేసారేమిటి" అని మధనపడ్డారు. అయ్యగారు సాయంకాలం ఆఫీస్ నుంచి వచ్చేశారు! మూడో సన్యాసి అయనేమోనన్న అనుమానం వచ్చింది. సేవకులకి! సందేహ నివృత్తి గురించి ఆయననే అడిగేశారు.

"అమ్మగారు అబద్ధం ఆడరు, ఇంకొకడెవడో తప్పకుండా ఉంటాడు!" అన్నారు అయ్యగారు.

ఎందుకైనా మంచిదని, మేడమ్‌ని "ఆ మూడో సన్యాసి ఎవరని" అడిగారు అయ్యగారు.

"మీరు యింత పిచ్చి సన్యాసి అని అనుకోలేదు, యింకెవరు! మీరే ఆ మూడో మగ సన్యాసి" అన్నారు అమ్మగారు.

అయ్యగారు "స్వ స్వరూప జ్ఞానం" లేనందుకు బాధపడ్డారు. తర్వాత ఒకసారి "ఆ మూడో సన్యాసి ఎవరో తెలిసింది అయ్యగారూ!" అని అడిగారు ఆ సేవక ద్వయం.

అస్తమానం మీరు చెయ్యవలసిన పనులు చెయ్యడం మానేసి, అనవసరమైన విషయాల గురించి ఆలోచిస్తూంటే, అసలు పన్లు దెబ్బతింటాయ్! మీ యిద్దరి గురించి మీరు ఏడవకండి! అసలు ఈ యింట్లో ముగ్గురు చెయ్యవలసినన్ని పన్లు లేనే లేవు! మీరు తిన్నగా ఏడిస్తే, అసలు అమ్మగారు ఆ మూడో సన్యాసి గురించి మాట్లాడవలసిన అవసరం లేనేలేదు!

"ఇక పై ఆ మూడో సన్యాసి ఎవరో తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తే చంపేస్తాను జాగ్రత్త!" అన్నారు "మూడో సన్యాసి"గా పేరు సంపాదించిన అయ్యగారు.